క్లుప్తంగా

కనుల పండువగా పల్లకీ సేవ

ఉరవకొండ రూరల్: మండల పరిధిలోని పెన్న హోబిలం లక్ష్మీనృసింహస్వామి పల్లకీ సేవ శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం వివిధ పుష్పాలతో అందంగా అలంకరించిన పల్లకీపై ఉత్సవమూర్తులను ఉంచి ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద హాజరై స్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమేష్‌బాబు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో జనార్దన వేంకటేశ్వరస్వామి

వజ్రకరూరు: స్థానిక బలిజవీధిలోని సీతారామస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామికి అర్చనలు, ప్రత్యేక అలంకరణ పూజలు జరిగాయి. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు జరిగాయి.

కూడేరుకు చేరిన పాఠ్యపుస్తకాలు

కూడేరు: 2025–26 విద్యా సంవత్సరం ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు శనివారం మండల కేంద్రానికి సరఫరా అయ్యాయి. పాఠ్య, నోట్ పుస్తకాలను కూడేరులోని ఎమ్మార్సీలో నిల్వ ఉంచారు. పాఠశాలలు ప్రారంభంకాగానే పిల్లలకు పంపిణీ చేస్తామన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

ఉరవకొండ రూరల్: పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి పావని తెలిపారు. శనివారం రాకెట్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ పొగాకు వినియోగంతో ఎక్కువశాతం రోగాలబారిన పడుతున్నారన్నారు. పొగాకుతో కేన్సర్‌తోపాటు ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

శెట్టూరు: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో విత్తన వేరుశనగ కాయల కోసం రైతులు సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ వాసుకీరాణి ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని రైతు సేవా కేంద్రాలకు ఇప్పటికే 11,00 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు సరఫరా అయ్యాయన్నారు. మండలానికి 2,500 క్వింటాళ్లు కే6 రకం, 100 క్విటాళ్లు కదిరి, లేపాక్షి 1812 రకం, 200 క్వింటాళ్లు టీసీజీఎస్ 1694 రకాలతో మొత్తం 2,800 క్వింటాళ్ల విత్తన కాయల కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఏఓ తెలిపారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

గుమ్మఘట్ట: రైతులు రైతు సేవా కేంద్రాల్లో విత్తన వేరుశనగకోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ నిర్మల్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కే6 రకం క్వింటా పూర్తి ధర రూ.9,300 కాగా, 40శాతం రాయితీ పోనూ రూ.5,580 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 30 కేజీల బస్తా ధర రూ.1,674 చెల్లించాలన్నారు. మండలానికి 3 వేల క్వింటాళ్ల వేరుశనగ మండలానికి కేటాయించినట్లు ఏఓ తెలిపారు.

నేడు సాహిత్య సమ్మేళనం

కుందుర్పి: మండల కేంద్రంలో కన్నడ సాహిత్య పరిషత్ గడినాడు శాఖ 9వ కన్నడ సాహిత్య సమ్మేళనం ఆదివారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక విన్సెంట్ ఫెర్రర్ ఆలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని ఆయన తెలిపారు.

బొలెరో వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు



కూడేరు ఎస్సీసీ నగర్ వద్ద ఢీకొన్న బొలెరో వాహనాలు

కూడేరు: మండలంలోని ఎస్సీసీ నగర్ సమీపంలో అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై రెండు లగేజీ బొలెరో వాహనాలు శనివారం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో రెండు వాహనాల డ్రైవర్లు షాషావలి, భీమేష్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. బొలెరో బళ్లారి నుంచి కిష్టిపాడుకు వెళ్తోంది. బెంగళూరు నుంచి బళ్లారి వెళ్తున్న బొలెరో వేగంగా వస్తూ అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. గాయపడిన వారిని పోలీసులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

శ్రమిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం

- ఉదయం పూట నడకతో ఊబకాయం దూరం
- లేజీతనంతో ఆరోగ్య సమస్యలు అధికం

రాయదుర్గం: కాలానికనుగుణంగా ప్రజల జీవనశైలి మారిపోయింది.. ఆహారపు అలవాట్లల్లోనూ మార్పులొచ్చాయి. తీరికలేని పనులతో ఒత్తిడి.. కుటుంబ సమస్యలు, ఉద్యోగ బాధ్యతలతో మానసిక సంఘర్షణ.. ఇలా అనేక సమస్యలు అనారోగ్య కారకాలవుతున్నాయి. వీటన్నింటికీ నిత్యం వ్యాయామం చేయడమే విరుగుడు.. చిన్న పిల్లల నుంచి వృద్ధులకు వరకు నడవడం, యోగా చేయడం, వ్యాయామం చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చు.

మైదానాలు, రోడ్డువైపున సాధన..

రాయదుర్గంలో జూనియర్ కళాశాల, మార్కెట్ యార్డు మైదానాలతో పాటు భంభంస్వామి లేఔట్, రైల్వేప్లాట్‌ఫాం, మద్దానేశ్వరస్వామి ఆలయం దారి పార్కుల్లో రహదారుల్లో నడకసాధన చేస్తున్నారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లోనూ కళాశాలలు, పాఠశాలల మైదానాలు, రోడ్ల వెంబడి వేకువజామున నడకకు చాలా మంది వెళ్తున్నారు.

రోజూ నడకతో ఆయుష్షు పెరుగుతుంది..

ప్రపంచ ఆరోగ్య సంస్థల ప్రకారం రోజుకు వెయ్యి అడుగులు నడిస్తే ఆయుష్షు 15శాతం పెరుగుతుంది. 2,500 అడుగులు నడిస్తే హృద్రోగాల బారిన పడే అవకాశం తగ్గుతుంది. 3900 అడుగులు అయితే ప్రాణాంతక వ్యాధులు 25 శాతం దూరం చేయొచ్చు. 10 వేల అడుగులు నడిస్తే చాలా వరకు అనారోగ్య సమస్యలు దూరంగా ఉంటాయి. ఇలా చేస్తే రోజంతా ఉత్సాహంగా పనుల్లో పాల్గొనవచ్చు. ఆహారపు అలవాట్లలోనూ మార్పులు చేసుకున్నట్టయితే సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చు.



30 నిమిషాలైనా నడవాలి..



రోజూ వ్యాయామంతోపాటు నడక సాధనతో అనేక లాభాలున్నాయని వైద్య, క్రీడా నిపుణులు సూచిస్తున్నారు. నడకను జీవితంలో భాగం చేసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని చెప్తున్నారు. కనీసం రోజూ 30 నిమిషాలు నడిస్తే జీర్ణశక్తి మెరుగుపడుతుందని, గంట నడిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ముందస్తు మరణాల ముప్పు 20 శాతం తగ్గుతుందని, బరువు అదుపులో ఉంటుందని, ఒత్తిడి, ఆందోళన దూరం చేసి, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, కండరాలు, ఎముకలు దృఢత్వానికి దోహం చేస్తుందని, దీర్ఘకాలిక రోగాలైన మధుమేహం, రక్తపోటు (బీపీ) లకు చెక్ పెట్టొచ్చని చెప్తున్నారు.

జాగ్రత్తలు కూడా తీసుకోవాలి..

రాయదుర్గంలోని బీటీపీ రహదారి పక్కన ఇటీవల ఓ మహిళ వేకువజామున కాలినడకన వెళ్తుంటే ప్రమాదవశాత్తూ వెనుక భాగంలో ఆటో వచ్చి ఢీకొనింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకుంది. బళ్లారి రోడ్డులో ఓ మహిళ కాలినడకతో వెళ్తుంటే ఆటో దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సమయాల్లో వాకింగ్ వెళ్లేవారంతా జాగ్రత్తలు పాటించాలి. ప్రధాన రహదారులు, సిమెంటు, బీటీ రహదారుల్లో కంటే మట్టి దారుల్లో వాకింగ్ చేయడం మంచిది. మైదాన ప్రాంతాల్లో వాకింగ్ చేయడం ఉత్తమం.

జీవనశైలి మారాలి



రోజుకు 40 నుంచి 50 నిమిషాలు నడిస్తే సరిపోతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సరైన పౌష్టికాహారం తీసుకోవాలి. 8 గంటలు నిద్రపోవాలి. మధుమేహం, రక్తపోటు అదుపులో ఉండాలంటే వంటలో ఉప్పు తక్కువగా ఉండాలి. ఈ రెండు ఇప్పటికే ఉన్నట్టయితే వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి. తగినట్టు వ్యాయామం, వాకింగ్ నిత్యం చేస్తుండాలి. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలి.

– మెర్సీ జ్ఞానసుధ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, రాయదుర్గం

సోమరితనం వీడాలి



నేను గత 20 ఏళ్లగా ఉదయం పూట వాకింగ్ వెళ్తాను. దీంతో రోజంతా ఉల్లాసంగా గడిపేస్తాను. ఈ రోజు వద్ద రేపటి నుంచి పోదాం.. ఉదయం 5 గంటలకు వద్దు.. 6 గంటలకు వెళ్దాం అంటూ 8 గంటలకు లేచే వారు సోమరితనం వీడాలి. ఏ పని ఉన్నా తప్పక వాకింగ్‌కు ఓ సమయం కేటాయించుకుంటే జీవితం సాఫీగా సాగుతుంది.

– మేకల శ్రీనివాసులు, రాయదుర్గం

ఎముకలు పటుత్వం



మహిళలు, పురుషుల్లో 40–50 ఏళ్ల మధ్య కాల్షియం తగ్గి కొవ్వు నిల్వలు పెరుగుతాయి. కండరాలు బలహీనమవుతాయి. 60 ఏళ్లు వచ్చే సరికి కాలి ఎముక మధ్యలో నాళం పెద్దది (ఆర్థోస్టోరోసిస్) గా మారుతుంది. ఎముకలు అరుగుతాయి. నడకతో వీటికి చెక్‌పెట్టొచ్చు. 65–70 ఏళ్లలో మెదుడు సంబంధిత వ్యాధులు వస్తాయి. చేతులు, కాళ్లలో వణుకు వస్తుంది. నడిస్తే కండరాల సామర్థ్యం, ఎముకలు పటుత్వం పెరుగుతుంది.

– రమేష్, వైద్యులు, గుమ్మఘట్ట

రంగయ్య పాదయాత్ర విజయవంతం చేయండి



యలగలవంకలో వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండలంలోని బ్రాహ్మణపల్లి తండా (గొంచ తండా) నుంచి ఈనెల 4న కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య చేపట్టిన ఆర్‌డీటీ పరిరక్షణ పాదయాత్రను విజయవంతం చేయాలని లీగల్‌సెల్ జిల్లా నాయకుడు హనుమంతరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పార్టీ లీగల్‌సెల్ నాయకులు వికలాంగ కమిటీ సభ్యులతో కలసి బ్రాహ్మణపల్లి తండా, యలగలవంక గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్‌డీటీ సేవలను కొనసాగించాలంటే ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 4న గొంచి తండా నుంచి మాజీ ఎంపీ తలారి రంగయ్య పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ వికలాంగుల నియోజకవర్గ విభాగ కమిటీ అధ్యక్షుడు పాత లింగప్ప, మాజీ సహకార సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ లేపాక్షి, నాయకులు మల్లాపురం రామాంజనేయులు, మారుతి, పెద్దప్పయ్య, సంతోష్‌రెడ్డి, తిమ్మరాజు, రామమూర్తి, బసిరెడ్డి, సురేష్‌రెడ్డి, గోవిందరాజులు, ఉమేష్, నాగరాజు, మారెప్ప, రాదాకృష్ణ, పురుషోత్తం, వైకే గోపాల్ పాల్గొన్నారు.

పాదయాత్ర విజయవంతం కావాలని పూజలు



కళ్యాణదుర్గం వెంకటేశ్వరాలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: ఆర్డీటీని పరిరక్షించాలని కోరుతూ కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య చేయనున్న పాదయాత్ర విజయవంతం కావాలని స్థానిక వెంకటేశ్వరస్వామి, అయ్యప్ప స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం పూజలు చేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రంపల్లి కృష్ణమూర్తి, వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి బోరంపల్లి రామిరెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కిరీటి, కౌన్సిలర్ పరమేశ్వరప్ప, వైస్ ఎంపీపీ కాంతమ్మ, నియోజవర్గం మహిళా విభాగం కన్వీనర్ నాగలక్ష్మి, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు మురళి, మాజీ మండల కన్వీనర్ తిరుమల వెంకటేశులు, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, నరేంద్రరెడ్డి, దేవా, రాజు, వెంకటేశులు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు



ఎంపీడీఓ శ్రీనివాసులును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కణేకల్లు: ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు ఉద్యోగ విరమణ సభను ఎంపీపీ వంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఏఆర్‌ఆర్ మాట్లాడుతూ ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు సేవలను కొనియాడారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ మండలానికి ఎంపీడీఓ చేసిన సేవలపై ఎనలేనివన్నారు. జెడ్పీటీసీ డి.పద్మావతి, వైస్ ఎంపీపీ లీలావతి, ఎంపీపీ, మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, ఎంపీటీసీలు జయరాం, గోపాల్, సర్పంచులు వన్నూరమ్మ, భాస్కర్‌రెడ్డి, జయరాంచౌదరి, రుద్రమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు జక్కలవడికి రమేష్ శాలువా కప్పి సన్మానించారు. మాజీ వైస్ ఎంపీపీ ఎ.మాబుసాబ్, మాజీ వైస్ సర్పంచు ఆనంద్ రాజు, టీడీపీ నాయకులు చాంద్‌బాషా, బీటీ రమేష్, లాలెప్ప, చంద్రశేఖర్‌గుప్తా, సుదర్శన్‌లు ఎంపీడీఓను సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఈఓఆర్‌డీ చంద్రమౌళి, మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ చిక్కణ్ణ, కణేకల్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్, ఏపీఓ సుధాకర్, ఎంఈఓలు తోపాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి



వంట మనిషిని సన్మానిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో పనిచేసే వంట మనిషి రామాంజనేయులు ఉద్యోగ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈసందర్భంగా వార్డెన్ మాట్లాడుతూ వంట మనిషి రామాంజనేయులు సేవలను కొనియాడారు. అనంతరం సన్మాన గ్రహీత రామాంజనేయులు మాట్లాడుతూ 41 ఏళ్ల పాటు సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో భారతసేవా రత్న అవార్డు గ్రహీత మల్లికార్జున, ఉపాధ్యాయులు క్రాంతి , మహబూబ్ బాషా, హాస్టల్ సిబ్బంది మురళీధర్, వెంకటేష్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై దాడులు అరికట్టాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కళ్యాణదుర్గం: సచివాలయ ఉద్యోగులపై రాజకీయ నాయకుల దాడులను అరికట్టాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్యోగులతో కలిసి నిరసన చేపట్టారు. ఇటీవల అనంతపురం కార్పొరేషన్‌లో పని చేస్తున్న సంక్షేమ కార్యదర్శిపై దుర్భాషలాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ ఇలాంటి దాడులతో ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ ఉపాధ్యక్షులు దివ్య శిల్ప, ఉపేంద్ర, శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి నవీన్ రెడ్డి, నాయకులు మనోజ్, ములకేష్, ప్రవీణ్, దివాకర్, కృష్ణయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

‘దుర్గం’లో అంతులేని భూ దోపిడీ

- రెచ్చిపోతున్న టీడీపీ నేతలు
- కొండను తవ్వి.. ప్లాట్లు వేసి విక్రయం
- చోద్యం చూస్తున్న అధికారగణం



కొండను చదును చేసి ప్లాట్ల కోసం రాళ్లు పాతిన దృశ్యం

రాయదుర్గం టౌన్: కూటమి అధికారంలోకి వచ్చాక రాయదుర్గంలో టీడీపీ నేతల దోపిడీకి అంతులేకుండా పోతోంది. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అండదండలు పుష్కలంగా ఉండడం, మరోవైపు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో చెలరేగిపోతున్నారు. హౌసింగ్ లేఅవుట్లలో పేదల ప్లాట్లు, కొండ పోరంబోకు, ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే విధంగా రెచ్చిపోతున్నారు.

కబ్జా చేసి.. దర్జాగా ప్లాట్లు వేసి..

టీడీపీ నేతల ధన దాహానికి కొండ పోరంబోకు స్థలాలు మయామవుతున్నాయి. ఇదే క్రమంలో కణేకల్లు రోడ్డు శనీశ్వరాయం నుంచి గౌడ హౌసింగ్‌కు వెళ్లే దారిలోని కొండ పోరంబోకు స్థలంలో ఉన్న గుట్టలను, రాళ్లను తొలగించి మట్టి దోపిడీ చేయడమే కాక స్థలాన్ని చదును చేసి ప్లాట్లు వేసి అందినకాడికి అమ్ముకుంటున్నారు. తాజాగా అదే స్థలంలో భూమిని చదును చేసి దర్జాగా రాళ్లు పాతి ప్లాట్లు వేశారు. కణేకల్లు రహదారికి పక్కనే ఉండడంతో ఒక్కో ప్లాటు రూ.1 లక్షకు పైగా విక్రయిస్తున్నట్లు సమాచారం. మరోవైపు మల్లాపురం ఇందిరమ్మ లేఅవుట్, బీటీపీ లేఅవుట్‌లలో కూడా కొందరు టీడీపీ నాయకులు గతంలో పేదలకు కేటాయించిన ప్లాట్లతోపాటు రిజర్వు స్థలాలను సైతం కబ్జా చేసి విక్రయించుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో అడ్డుకొని కొండ, రిజర్వు స్థలాలను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం

రాయదుర్గం పరిధిలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. కొండపోరంబోను ఎవరైనా కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, తహసీల్దార్, రాయదుర్గం

నేమకల్లు ఆంజనేయస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో అంజన్న

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామి మూల విరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

కూడేరు: కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి అన్నారు. శనివారం కూడేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యారంగానికి పెద్ద పీట వేసిందని గుర్తు చేశారు. ఇటీవల జరిగిన మహానాడులో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యారంగ అభివృద్ధిపై కనీసం ప్రస్తావించలేదన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం పథకాల ఊసే లేదన్నారు. విద్యార్థుల సమస్యలు పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు.

అనారోగ్యంతో మాజీ వలంటీర్ మృతి



పుష్ప (ఫైల్)

కణేకల్లు: మండలంలోని ఎస్.హనుమాపురానికి చెందిన వలంటీర్ పుష్ప (38) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. పుష్ప వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్‌గా పని చేసింది. భర్త నాగరాజు స్టోర్ డీలర్‌గా పని చేశాడు. కూటమి ప్రభుత్వం వలంటీర్లను కొనసాగిస్తామని చెప్పి పూర్తిగా తొలగించింది. నాగరాజును డీలర్‌గా తొలగించారు. అప్పటి నుంచి భార్యాభర్తలు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. జీవనాధారమైన వలంటీర్ పోస్టు, స్టోర్ డీలర్‌గా భర్తను తొలగించడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో పుష్ప మానసికంగా మదనపడుతుండేది. అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచు పైనేటి తిమ్మప్ప చౌదరి తదితరులు పుష్ప మృతదేహానికి నివాళులర్పించారు.

వైభవంగా శ్రీనివాస విగ్రహ ప్రతిష్టాపన



ఉత్తరాది మఠంలో ప్రతిష్ఠించిన శ్రీనివాసుడి విగ్రహం

రాయదుర్గంటౌన్: స్థానిక కోటలోని ఉత్తరాది మఠంలో శ్రీనివాస విగ్రహ ప్రతిష్టాపన శనివారం వైభవంగా జరిగింది. శ్రీమద్ ఉత్తరాధి మఠ పీఠాధిపతి శ్రీసత్యార్థ తీర్థ స్వామిజీ ఆధ్వర్యంలో ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది. ఉదయం ఆదివాసాలు, మహా మంత్ర హోమాలు జరిపించారు. ఉదయం ప్రాణప్రతిష్ఠ, కుంభాషేకం, సత్య బోధ సభా మంటపం ఉద్ఘాటన గావించారు. కార్యక్రమంలో ఉత్తరాది మఠం సభ్యులు, బ్రాహ్మణ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కుల వివక్షను రూపుమాపుదాం



కదిరిదేవరపల్లిలో సివిల్ రైట్స్‌డేలో పాల్గొన్న అధికారులు



గుమ్మఘట్ట: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం: కులవివక్షను రూపుమాపుదామని తహసీల్దార్ బాలకిషన్ అన్నారు. కంబదూరు మండలం కదిరిదేవరపల్లి గ్రామంలోని ఆర్డీటీ పాఠశాలలో శనివారం సివిల్ రైట్స్ డే సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. పౌర హక్కులపై చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఎస్‌ఐ ప్రవీణ్, సంక్షేమ వస తి గృహ అధికారి నాగరాజు పా ల్గొన్నారు.

మల్లాపురం ఎస్సీకాలనీలో.. : కళ్యాణదుర్గం మండల పరిధిలోని మల్లాపురం ఎస్సీ కాలనీలో అధికారులు శనివారం సివిల్స్ రైట్స్ డే నిర్వహించారు. డీటీ కుళ్లాయప్ప, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రంగనాయకులు, సబ్ డివిజనల్ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు మోహన్ పాల్గొని, చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన

గుమ్మఘట్ట: ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని బేలోడు గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో పౌర హక్కులు, బాధ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హక్కులు, బాధ్యతలు తెలుసుకుని మసలుకోవాలన్నారు. హక్కులు, బాధ్యతలకు ఇతరులు భంగం కలిగించరాదన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రామాంజనేయులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

పింఛన్ అందుకున్నాడు.. అంతలోనే ప్రాణాలొదిలాడు



మృతి చెందిన దివ్యాంగుడు రామాంజనేయులు

కూడేరు: పింఛన్ నగదు అందుకున్న నిమిషాల వ్యవధిలోనే ఓ దివ్యాంగుడు మృతి చెందాడు. కూడేరు ఎస్సీ కాలనీకి చెందిన రామాంజనేయులు (52) దివ్యాంగుడు. ఇతనికి భార్య (స్థానికంగా పారిశుద్ధ్య కార్మికురాలు), ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. శనివారం ఉదయమే భార్య చెత్త సేకరణకు వెళ్లింది. సచివాలయ సిబ్బంది పింఛన్ నగదు అందజేసి వెనుదిరిగారు. కొద్ది సేపటి తర్వాత అతను మృతి చెందాడు. గుండె పోటుతో మృతి చెంది ఉండొచ్చని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.